

చేనేత, జౌళీ శాఖ డిప్లొమా కోర్సులో దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హైదరాబాద్‌లో నూతనంగా మంజూరు కాబడిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరానికి గాను కేటాయించిన 60 సీట్లకు చేనేత, జౌళీ సాంకేతిక డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని చేనేత, జౌళీ శాఖ సహాయ సంచాకులు కె విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కోర్సు వ్యవధిలో ఆరు సెమిస్టర్లు ఉంటాయన్నారు. ఇతర వివరాల కోసం 9030079242 లో సంప్రదించాలని సూచించారు.

రేపు దిన, వార సంత వేలం

ఆసిఫాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లోని రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో దిన, వార సంత వేలంను ఈ నె 22న గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న నిర్వహించిన దిన, వార సంత వేలం పాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాక పోవడంతో వాయిదా వేయడం జరిగిందని, తిరిగి ఈ నెల 22న నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు తైబజారు టెండరు ప్రక్రియ

కాగజ్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో శుక్రవారం ఉదయం తైబజారు టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు కమిషనర్ అంజయ్య ఒక ప్రటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల తైబజారు వేలానికి, మధ్యాహ్నం 12 గంటల నుంచి పశువులను వధించుటకు, మధ్యాహ్నం 1 గంటకు మేకలు, గొర్రెలు వధించుటకు టెండరు ప్రక్రియ చేపట్టనున్నట్టు వివరించారు. పాల్గొనే వారు తప్పకుండా తమ ఆస్తి పన్ను, నీటి పన్ను 31-3-2025 వరకు చెల్లించాల్సి ఉండాలని తెలిపారు.



2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనిదినాలు, కూలీ చెల్లింపు అంచనా ఇలా..

మండలం	పనిదినాల లక్ష్యం	చెల్లింపులు (రూ. కోట్లలో)
చింతలమానేపల్లి	2,18,134	6.54
బెజ్జూరు	4,64,060	13.92
పెంచికలపేట	1,65,068	4.95
దహెగాం	3,81,624	11.44
కౌటాల	3,42,800	10.28
కాగజ్‌నగర్	2,90,975	8.72
సిర్పూర్(టీ)	2,08,658	6.25
సిర్పూర్(యూ)	2,09,000	6.27
రెబ్బెన	3,41,384	10.24
లింగాపూర్	1,65,220	4.95
ఆసిఫాబాద్	3,31,600	9.95
కెరమెరి	4,24,150	12.74
వాంకిడి	2,80,453	8.41
జైనూరు	2,84,114	8.52
తిర్యాణి	3,25,917	9.77
మొత్తం	44,33,277	132.99

ఉపాధికి పెరిగిన పని దినాలు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పనుల అంచనా
- వ్యవసాయ, మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- జిల్లాలో మొత్తం కార్డులు 1,23,035

చింతలమానేపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2005లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కూలీలకు ఉపాధి కల్పించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం జిల్లాలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ, మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడుతోంది. రైతులు తమ చేన్లలోకి వెళ్లేందుకు మట్టి రోడ్ల నిర్మాణంతో పాటు రైతుల పొలాల్లో కుంటలు, గట్లు, తదితర వ్యవసాయ పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సైతం ఈ పథకం ద్వారా చేపడుతున్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి వంద రోజుల పని దినాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ ఏడాది 2025-26 ఆర్థిక సంవత్సరానికి అధికారులు ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనాకు మించి పనులు పూర్తి చేయడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి పని దినాల పెంపుతో కూలీలకు మరింత ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

44.33 లక్షల పనిదినాలు లక్ష్యం..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం 1,23,035 జాబ్‌కార్డులు ఉండగా, 2,43,969 మంది కూలీలున్నారు. ఇందులో యాక్టివ్ జాబ్ కార్డులు 91,721 ఉన్నాయి. 1,70,268 మంది కూలీలు యాక్టివ్‌గా పనులు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 38,71,840 పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే లక్ష్యానికి మించి పనులు చేశారు.

ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఊరూరా గ్రామసభలు నిర్వహించి పనుల గుర్తింపు చేపట్టారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో 44,33,277 పనిదినాలను లక్ష్యంగా ఏర్పాటు చేసుకోగా అందుకుగానూ కూలీల చెల్లింపు కోసం రూ. 132.99కోట్లు వ్యయం చేయ నున్నట్లు అంచనా రూపొందించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ముఖ్యంగా వ్యవసాయ సంబంధిత పనులు చేపట్టనున్నారు. కుంటల తవ్వకం, పంట చేన్లకు వెళ్లేందుకు మట్టి రోడ్లు వేయడం, గట్టులు పోయడం, కందకాల తవ్వకం, చెరువుల్లో పూడిక తీత, చేపల ఉపాధి పనులు ఉపయోగపడనున్నాయి. కూలీలందరికీ పని కల్పించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అధికారులు తెలిపారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పకడ్బందీ ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 19.03.2025 వరకు ఆన్‌లైన్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో 6,7,8 ఫారం 5,481 దరఖాస్తులు వచ్చాయన్నారు. 4,559 దరఖాస్తులను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. వివరాలు సరిగ్గా లేని 369 తిరస్కరించినట్లు తెలిపారు. 553 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. రాజకీయ పార్టీలు స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. సమావేశంలో సంబం ధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహద్ సత్యాగ్రహ దినోత్సవం

వాంకిడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జైత్వన్ బుద్ధ విహార్‌లో గురువారం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జయరాం అధ్యక్షతన మహద్ సత్యాగ్రహ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కుల వివక్షకు వ్యతిరేకంగా 1927 మార్చి 20న మహద్ చెరువు వద్ద సత్యాగ్రహం చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు సందీప్, విలాస్, పాండు, వినేష్, భీంరావు, ప్రతాప్, ప్రకాష్, శ్యాంరావు, రాజేశ్వర్, ప్రశాంత్, స్వాగత్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల ప్రాంతాల గ్రామాల ప్రజలు మిషన్ భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ సిద్ధికి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామానికి అందుబాటులో ఉందని జిల్లా ప్రజలు నీటిని సురక్షితంగా తాగవచ్చని దీని ద్వారా వేసవిలో నీటి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెం.1800-599-4007కి కాల్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

దహెగాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్, రసాయన శాస్త్రం పరీక్షలకు 128 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 122 మంది హాజరయ్యారు. కాగా ఆరుగురు గైర్హాజరైనట్లు సీఎస్ గణపతి, డీవో సత్యనారాయణ తెలిపారు.

'క్రీడలతో మానసికోల్లాసం'



విజేతకు కప్‌ను అందజేస్తున్న లెండుగురే శ్యాంరావు

కాగజ్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అన్నారు. గురువారం మండలం భట్టుపల్లిలో క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపు మేరకు టోర్నీ నిర్వహించినట్టు తెలిపారు. విజేతగా వంకులం, రన్నర్‌గా భట్టుపల్లి టీం నిలిచింది. గెలుపొందిన జట్టుకు కప్‌ను బీఆర్ఎస్ సిర్పూరునియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అందజేశారు. మండల కన్వీనర్ ఆవుల రాజ్ కుమార్, కోకన్వీనర్ పార్వతి అంజన్న, నాయకులు చరణ్‌దాస్, జిల్లా రాగులయ్య, సత్తన్న, చిలుక శేఖర్, ముంజం లింగయ్య, రవి, రాజు, రమేష్, రవి పాల్గొన్నారు.

భూములను సాగు చేయనీయకుంటే ఎలా?

బెజ్జూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోడు భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమ పంట చేనుల్లో పత్తి కట్టె తొలగించ వద్దంటే ఎలా అని రైతులు ప్రశ్నించారు. తాము 50 ఏళ్లుగా చావు భూముల్లో పంటను సాగు చేసిన పత్తి కట్టెను తొలగించొద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేవారు. మండలంలోని పాపన్నపేటలో గురువారం రైతులు విలేకరులతో మాట్లాడారు. తమ భూములను దున్నవద్దని అటవీ అధికారులు ట్రాక్టర్ యజమానులకు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేనుల్లో పత్తి కట్టే తొలగించనీయకపోవడం, దున్ననియ్యక పోవడం ఎంత వరకు న్యాయమన్నారు. ఇంటి ఆవరణలో కనీసం బోరు సైతం వేసుకోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



రెబ్బెనలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రాంమోహన్‌రావు



దహెగాంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు

ఆసిఫాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 6,421 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారు. ఇందులో 2,894 బాలురు, 3,527 బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 36 మంది సీఎస్‌లను, 26 మంది డీవోలను నియమించారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ రాంమోహన్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షరాసే విద్యార్థులకు అన్నీ వసతులు కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.

దహెగాం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యాలయాల్లో పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 మంది, కేజీబీవీలో 116 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 16 మంది ఇన్విజిలేట్లు, ఇద్దరు సీఎస్‌లు, ఇద్దరు డీవోలను నియమించినట్లు ఎంఈఓ తెలిపారు.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీవో సునీత తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో రెండు కేంద్రాలు ఏర్పా టు చేయగా 267 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రెండు కేంద్రాల్లో 16 మంది ఇన్విజిలేటర్లను, ఇద్దరు సీఎస్, డీవోలు నియమించినట్లు పేర్కొన్నారు.

సిర్పూర్(టి) (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. మండల కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా 635 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 38 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఇతరాత్ర సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

కెరమెరి (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ప్రకాష్ తెలిపారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందులో 336 మంది పరీక్షలు రాయనున్న ట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168 మంది, మోడి ఆశ్రమ పాఠశాలలో 168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

రుణాలపై అవగాహన

వాంకిడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం స్థానిక బ్యాంకు ఆవరణలో వినియోగదారులకు రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా గృహ రుణాలు, రైతు నేస్తం రుణాలు, వాహన రుణాలు, వ్యాపార రుణాలు, బంగారంపై రుణాలు అందిస్తామని తెలిపారు. రైతులు, వ్యాపారవేత్తలు, చిన్నతరహా వ్యాపారులు రుణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనంగా బ్యాంకు రుణ విధానాలు, వడ్డీ రేట్లు, మార్జిన్ డబ్బు వంటి అంశాలపై వివరాలు అందించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడ మే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట హబ్ ప్రాసెసింగ్ ఆఫీసర్ సంధ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీముఖ్, సీఎస్పీ ప్రతినిధి రాకేష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కృష్ణ

మహిళా సాధికారతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- 22, 23 తేదీల్లో ఇందిరా ఫెలోషిప్ క్యాంపు - కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ

ఆసిఫాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, జిల్లాలోని లింగాపూర్ మండలం చోర్‌పల్లి గ్రామంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఇందిరా ఫెలోషిప్ తెలంగాణ రాష్ట్ర బూత్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ ఆదిలాబాద్ లోక్‌సభ కోఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరవుతారన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జ్ఞాపకార్థం, రాజకీయాలు, పాలనలతో సహా ప్రతి రంగంలో మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించడానికి భారత జాతీయ కాంగ్రెస్ ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనిని రాహుల్ గాంధీ అక్టోబరు 14, 2023న తొలిసారిగా ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం లక్ష్యం మహిళలను రాజకీయాల్లోకి తీసుకురావడం, ప్రతిరంగంలోనూ తమదైన ముద్ర వేయడానికి వీలుగా నాయకత్వ లక్షణాల కోసం శిక్షణ ఇవ్వడమని తెలిపారు. మహిళా సాధికారత కోసం మహిళలందరు ఇందిరా ఫెలోషిప్‌లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు కళావతి, యశోద, ప్రతిభ, విజయ, రాజేశ్వరి, పద్మ, శంకరమ్మ, రేణుక, సుధాక ర్, భీంరావు, శ్యాం, తిరుపతి, గంగారాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సౌజన్యంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని యువతులకు స్థానిక రోజ్ గార్డెన్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. దాని కోసమే నియోజక వర్గంలోని నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్యాకింగ్ సెక్షన్‌లో యువతులు పని చేయాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గం నుంచి రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జాబ్ మేళా నిర్వహణకు యువతులు పెద్దఎత్తున తరలిరావడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌కేఎస్ఎస్ ఫీల్డ్ మేనేజర్ కృష్ణ, శివలు మాట్లాడుతూ యువతులకు 19 వేల వేతనం చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ ఉంటుందన్నారు. అవకాశాలు ఎప్పుడు రావని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కృషితో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంటనే ఉద్యోగంలో చేరిన వారికి బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం యువతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు సాయినాథ్, సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు రవీందర్, సౌందర్య, పోచయ్య, సంజీవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు కృషి

● ప్రవీణ్‌కుమార్, ఎస్సై



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతలను అదుపులో పెట్టేందుకు చేపడుతున్న చర్యలేమిటి?

ఎస్సై : గ్రామాల్లో శాంతిభద్రతలను అదుపులో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో నిత్యం పెట్రోలింగ్ చేపడుతున్నాము.

ఆంధ్రజ్యోతి : పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై చేపడుతున్న చర్యలేమిటి?

ఎస్సై : మండలంలో పేకాట జూదం, కోడి పందాల నిర్వహణపై ఉక్కు పాదం మోతున్నాం. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించి కఠినచర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్సై : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. పాఠశాలల్లో, కళాశాలల్లో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

పరీక్షల సమయం.. ఎండలతో పైలం



● నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ● జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

వాంకిడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇటు పరీక్షల కాలం.... అటు ఎండాకాలం కలిసి వచ్చాయి. ఈ నెల 21నుంచి ఏప్రిల్ 2వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 36పరీక్షా కేంద్రాల్లో 6,421మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి మొదటివారం నుంచే తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో పిల్లలు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. సక్రమంగా ఆహారం తీసుకోకుండా పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. ఒక పక్క పరీక్షలు మరోవైపు ముదురుతున్న ఎండలు నేపథ్యంలో విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

● నీరసం రాకుండా ...

రేకుల షెడ్లు వెంటిలేషన్ సరిగా లేని గదుల్లో పరీక్ష రాసే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఎండలో వడదెబ్బ బారిన పడితే నీరసంతోపాటు దాని ప్రభావం మెదడుపైనా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటినప్పుడు అధిక వేడి తగులుతుంది. నీరు చెమట రూపంలో శరీరం బయటకు వెళ్తుంది. నీరు ఎక్కువగా తాగాలని వైద్యులు చెప్తున్నారు.

● నీళ్ల సీసా వెంట ఉంచాలి

ఎండలు, వడగాలుల కారణంగా విద్యార్థులు వడదెబ్బ బారినపడి అస్వస్థతకు గురయ్యే ప్రమాద ముంది. పరీక్షలకు వెళ్లే ముందు నీళ్ల సీసా వెంట తీసుకెళ్లాలి. మధ్యమధ్యలో నీళ్లు తాగకుంటే డీహైడ్రేషన్‌కు గురవుతారు. 24గంటల వ్యవధిలో 8-10 గ్లాసుల నీళ్లు తాగాలి. ఎండలో వెళ్తే టోపీ, గొడుగు వాడాలి. కళ్లజోడు పెట్టుకోవాలి. విద్యార్థులు తేలికపాటి, లేతరంగు దుస్తులు ధరించడం శ్రేయస్కరం. కూల్‌డ్రింక్స్, చెరుకు రసం, జ్యూస్‌లు, ఐస్ కలిపిన పానియాలు తాగొద్దు. నూనె పదార్థాలు, వేపుళ్లు, ఉప్పు ఎక్కువగా ఉండే జంక్‌ఫుడ్స్ తీసుకోకూడదు.

విద్యార్థులు భయాన్ని వీడాలి

దండేపల్లి : పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆందోళన చెందకుండా విజయం సాధించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి. మొదటిసారి బోర్డు పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పలు సలహాలు సూచనలతో ఆంధ్రజ్యోతి కథనం ఇది..

● పరీక్ష కేంద్రంలో ఇవి నిషేధం..

పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థి తప్పని సరిగా బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తన వెంట తీసుకెళ్లాలి. అదనంగా మరో పెన్ను వెంట తీసుకువెళ్లడం మంచింది. సెల్‌ఫోన్, కాలిక్యూలేటర్ సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోని అనుమతించరు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.

● హాల్‌టికెట్ సరిచూసుకోవాలి..

విద్యార్థులందరు తమ హాల్ టికెట్ చేతికందగానే దాంట్లో ఏవైనా పొరపాట్లు ఉన్నాయి? అనే నిర్ధారించుకోని తగిన చర్యలు తీసుకోవాలి. పరీక్ష కేంద్రం ఎక్కడుంది? ఇంటి నుంచి అక్కడికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుంతనే విషయాన్ని ముందే విద్యార్థులు పరిశీలించుకోవాలి.

పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి..

ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుంది. హింది పరీక్షకు మాత్రం అదనంగా 30 నిమిషల సమయాన్ని కేటాయించారు. 8:45 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు విద్యా ర్థులను అనుమతించనున్నారు.

తేలికపాటి పదార్థాలు తీసుకోవాలి



విద్యార్థులకు పరీక్షల కాలంలో పోషకాహారం అందించాలి. కొవ్వు పదార్థాలను పూర్తిగా దూరం పెట్టాలి. భోజనంలో పీచు, కార్బోహైడ్రేట్లతో కూడిన పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. మసాలా వంట కాల జోలికి పోవద్దు. తరచూ నీరు తాగకపోతే శరీర ఉష్ణోగ్రత సమతుల్యత దెబ్బతింటుంది. విద్యార్థులు ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ వినయ్ ఉప్రె

- వాంకిడి వైద్యాధికారి

వివాహిత అదృశ్యం..కేసు నమోదు

నెన్నెల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చెందిన 22 ఏళ్ల వివాహిత బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బ్యాంక్‌లో పని ఉందని నెన్నెలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి ఎటో వెళ్లిపోయిందని చెప్పారు. భర్త, కుటుంబ సభ్యులు వెతికి నప్పటికి ఆచూకీ లభించక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కాగజ్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రాజెక్టు మానిటరింగ్ రిసోర్స్ సెంటర్ అకాడమిక్ కమ్యూనిటీ మొబైలింగ్ అధికారి ఉద్ధవ్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్ష హాలులో ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, ధర్మారావు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై విస్తృత ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు

సిర్పూర్(టి), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఒకే దేశం, ఒకే ఎన్నికపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వన్‌నేషన్, వన్ ఎలక్షన్ వల్ల ఆర్థికాభివృద్ధి మెరుగు పడుతుందన్నారు. దీంతో మిగులు బడ్జెట్ లభిస్తుందన్నారు. ప్రతి రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశాభివృద్ధి చెందుతుందన్నారు. దీనిపై నాయకులు, కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు దత్తుమూర్తి, బీజేపీ నాయకులు లావణ్య, నానయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రేపు పోడు సమస్యపై మహాధర్నా

బెజ్జూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఈ నెల 22న పోడు భూముల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకుడు సకారాం తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో గల పోడు రైతులను అటవీ అధికారుల ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కోనేరు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, పోడు రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు సకారాం, వెంకన్న, బషరత్‌ఖాన్, సతీష్‌కుమార్, పురుషో త్తం, మానుకయ, పెంటయ్య, చిన్నన్న, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు రమేష్

పెంచికలపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌వో కవిత అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మోటివేషనల్ స్పీకర్ సుందిళ రమేష్ విద్యార్థులకు పలు విషయాలు వివరించారు. ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం వరిస్తుందని తెలిపారు. సినిమాలు, చెడు అలవాట్లు, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఫిజికల్ రిలాక్సేషన్, మెంటల్ రిలాక్సేషన్, ఎమోషనల్ రిలాక్సేషన్ వివరించారు. విద్యార్థి దశలోనే వారి బలాలు, బలహీనతల గురించి వాటిని జయించే పద్ధతులను వివరించారు.

రెండు ఆన్సర్ షీట్లకు బదులు ఒకటే ఇచ్చారని..

వొకేషనల్ విద్యార్థినుల ఆందోళన



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

బెజ్జూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కుమరంభీం జిల్లా బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ వొకేషనల్ బ్రిడ్జి కోర్సు విద్యార్థినులు ఆందోళన చేశారు. అధికారులు విద్యార్థినులకు బ్రిడ్జ్ కోర్సు బోటనీ, జువాలజీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సపన్‌మండల్ బ్రిడ్జ్ కోర్సు బోటనీ, జువాలజీ పరీక్షకు రెండు వేర్వేరు ఆన్సర్ షీట్లు ఇవ్వాల్సి ఉండగా బోటనీ, జువాలజీ కలిపి ఒకే ఆన్సర్ షీట్ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బ్రిడ్జి కోర్సు విద్యార్థినులు 22 మంది, రెండో సంవత్సరం విద్యార్థినులు 33 మంది పరీక్షలు రాశారు. మొ త్తం 55 మంది భవిష్యత్ నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రెండు బుక్‌లెట్లు ఇవ్వాలని అడిగినప్పటికీ సీఎస్, ఇన్విజిలేటర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని విద్యార్థినులు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ ఫిర్యాదు చేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి (డీఐఈఓ) కళ్యాణి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. ఈ విషయమై బెజ్జూరు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ మండల్‌ను సంప్రదించగా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, విద్యార్థినులకు అన్యాయం జరిగితే పూర్తి బాధ్యత తానే వహిస్తానని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విద్యార్థినులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



'పాత టబ్బులతో ఉత్పత్తికి అంతరాయం'



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాత టబ్బులతో ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని ఉద్యోగులు పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కే 7 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. పాత టబ్బులను రిపేరు చేసి అందిస్తున్నారని, దీనివల్ల టబ్ ఆవరేజ్ తగ్గుతోందన్నారు. అలాగే లైన్‌మెన్ కార్మికులకు సరిపడా కీలలు ఇవ్వడం లేదన్నారు. నాసిరకమైన హ్యాండ్ గ్లౌసులు సరఫరా చేస్తున్నారన్నారు. షాంప్లింగ్ మజ్దూర్లకు అవసరమైన రూమ్‌ను రిపేరు చేయించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఆయా సమస్యలను గని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పిట్ కార్యదర్శి మారపల్లి సారయ్య, సహాయ కార్యదర్శి సదానందం, నాయకులు సురేష్, రాజ్‌కుమార్, తిరుపతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగింపు రిపోర్టులు సక్రమంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

శ్రీరాంపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు రిపోర్టులు సక్రమంగా ఉండాలని ఎస్‌ఓటు జీఎం ఎన్ సత్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలకు అంశాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గనులు, విభాగాల నుంచి బిల్లులు, ఇతర రిపోర్టులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. త్వరగా పని పూర్తి చేసి ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏజీఎం(ఫైనాన్స్) ఈ. బీభత్స, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం(స్టోర్స్) మల్లయ్య, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో పెరుగుతున్న ఉద్యోగుల గైర్హాజరు

- డిస్మిస్ అవుతున్న కార్మికులు - కౌన్సెలింగ్ ద్వారా మార్పు కోసం ప్రయత్నిస్తున్న యాజమాన్యం



గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల గైర్హాజరు శాతం రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు సంవత్సరాలుగా గైర్హాజరు శాతంతో యాజమాన్యం తల పట్టుకుంటుంది. రోజు వారీగా కార్మికులు విధులకు గైర్హాజరు కావడం మూలంగా దీని ప్రభావం ఉత్పత్తిపై పడుతోంది. చాలా మంది కార్మికులు డిస్మిస్ అయిన సందర్భాలు ఉన్నాయి. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులు వ్యక్తిగత సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలతో విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది. మందమర్రి ఏరియాలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులను తిరిగి విధులు నిర్వహించే విధంగా యాజమాన్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గనుల, డిపార్టుమెంట్ల వారీగా ఉద్యోగుల కుటుంబ సభ్యులను పిలిపించి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తోంది. పనిస్థలంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని కూడా చెబితే పరిష్కారానికి కృషిచేస్తామని యాజమాన్యం పేర్కొంటుంది. గైర్హాజరు అవుతున్న కార్మికులు చిన్న చిన్న సాకులతోనే విధులకు రాకపోవడం ఇటు కుటుంబాలను, అటు యాజమాన్యానికి ఇబ్బందిగా మారింది. కొద్ది సంవత్సరాల క్రితం విధులకు గైర్హాజరైన కార్మికులపై దృష్టి సారించలేదు. కాని ప్రస్తుతం వారి విధులకు హాజరు కాకపోవడం మూలంగా సింగరేణి క్వార్టర్, కరెంటుతో పాటు కంపెనీకి భారంగా మారడంతో సీరియస్‌గా తీసుకొని తప్పకుండా వారు విధులు నిర్వహించేలా చర్యలకు పూనుకుంటుంది.

సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు గనులు, డిపార్టుమెంట్లు అనే తేడా లేకుండా ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాల ద్వారా వారిలో మార్పునకు ప్రయత్నాలు చేస్తోంది. మందమర్రిలో ఇది కొంత సత్ఫలితాలను ఇస్తోంది. ఈ మధ్య కాలంలో కౌన్సెలింగ్ హాజరైన కార్మికులు విధులకు హాజరవుతున్నారు. వారికి ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే సులభతర పనులను యాజమాన్యం చెబుతూ వారు డిస్మిస్ కాకుండా అండగా ఉంటున్నది. ఏమైనా సింగరేణిలో రెండు దశాబ్దాల క్రితం కార్మికులు గైర్హాజరైన సందర్భాలు చాలా తక్కువ అని రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగంలో చేరిన కొంత మంది విధులకు గైర్హాజరు కావడం కుటుంబంతో పాటు సింగరేణి యాజమాన్యానికి కొంత ఆందోళన కలిగిస్తోంది.

ఉద్యోగంలో చేరే ముందు అన్ని ఆలోచించుకోవాలని యాజమాన్యం పేర్కొంటుంది. కారుణ్యం ద్వారా ఉద్యోగంలో చేరే యువతీయువకులకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలను కూడా ఈ విషయాలన్ని కూడా అధికారులు వివరిస్తున్నారు. పని వద్దనుకుంటే యాజమాన్యం 20 లక్షలు ఇస్తుంద నే విషయాన్ని కూడా అధికారులు పేర్కొంటున్నారు. మొత్తానికి భవిష్యత్‌లో ఉ ద్యోగులు గైర్హాజరు కాకుండా పకడ్బందీగా ప్రచారం చేస్తూ గైర్హాజరు కార్మికులకు హితబోధలు చేస్తూ విధులు నిర్వహించేలా చర్యలు చేపడుతుంది.

కాంట్రాక్టు కార్మికులకు జరిమానా రద్దు చేయాలి

శ్రీరాంపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు జరిమానాను రద్దు చేయాలని సింగరేణ కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి. బ్రహ్మానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న కోరారు. ఈ మేరకు వారు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు కె. వెంకటేశ్వర్లు, ఎల్‌వి సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, నూతనంగా పిలుస్తున్న టెండర్లలో కాంట్రాక్టర్లకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఈ విషయం గురించి కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తూ వారు నిరసనలు తెలుపుతున్నారన్నారు. టెండర్లు వేయడం లేదన్నారు. దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డైరెక్టర్లను కలిసి ఈ సమస్యను విన్నవించామన్నారు. జరిమానా విధించే విధానం రద్దు చేయాలని కోరారు. ఇందుకు డైరెక్టర్లు ఒప్పుకున్నట్లు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు సంజీవ్, రమేష్, లింగయ్య, సంపత్, తిరుపతి, ఆర్‌జీ-3 కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌వోటు జీఎం రాజమల్లు

రెబ్బెన, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కేటాయింపు కోసం నిర్వహించే కౌన్సెలింగ్ పారదర్శకంగా సాగుతుందని బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటూ జీఎం రాజమల్లు తెలిపారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇఇ(సివిల్) రాజేంద్ర ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాయి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): క్వార్టర్ల కేటాయింపు కోసం అధికారులు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం కార్యాలయంలో జరిగాన కౌన్సెలింగ్‌కు 9 మంది అధికారులు హాజరయ్యారు. సీనియారిటీ ప్రకారం వారికి క్వార్టర్లు కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్ కమిటీ ఎన్నిక



జగ్గయ్య

రెబ్బెన, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్ కమిటీని ఎన్నుకున్నట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. బుధవారం రాత్రి జరిగిన ఫ్యామిలీ డే కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా బి జగ్గయ్య, కోశాధికారిగా వడపల్లి దిలీప్, గౌరవ కార్యదర్శి పర్సనల్ అధికారి ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుడికి పరామర్శ



శశికాంత్‌ను పరామర్శిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కాసిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాసిపేట 1వ గనిలో విధులు నిర్వహిస్తున్న రూఫ్ బైసర్ కార్మికుడు శశికాంత్ అస్వస్థతకు గురై బీజోన్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య గురువారం పరామర్శించారు. శశికాంత్ రెండు రోజులుగా ఫ్రీ షిఫ్టు విధులు నిర్వహించాలని పంపిన అధికారులు సాయంత్రం 5 గంటల వరకు పనిచేయించడంతో నీరు, ఆహారం లేక నీరసించి స్పృహ తప్పి పడిపోయాడన్నారు. గమనించిన తోటి కార్మికులు అధికారులకు సమాచారం అందించడంతో బీజోన్ ఏరియా ఆసుపత్రికి తరలించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తుపై విచారణ

జన్నారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన గడ్డి రాజు భూమి హద్దుల విషయంపై ప్రజావాణిలో ఇటీవల ఫిర్యాదు చేయగా తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని సర్వే నంబరు 32లోని భూమి మోకాను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భానుచందర్, సర్వేయర్, ఎస్‌ఐ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు..

ఎస్సై రాజశేఖర్, మందమర్రి



మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని, ఒక్కో సందర్భంలో ప్రాణాలు కూడ కోల్పోతారని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మందమర్రిలో ఇప్పటి వరకు ఎన్ని డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు..?

ఎస్సై : 9 నెలలుగా 600లకు పైగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం. అంతేగాకుండా సామాజిక సేవా శిక్ష కూడ అమలు చేశాం. డ్రంకెన్ డ్రైవ్ కింద దొరికిన వారు ప్రభుత్వ వైద్యశాలల్లో మూడు రోజులపాటు పరిశుభ్రత పనులు చేశారు.

ఆంధ్రజ్యోతి: చిన్న పిల్లలు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు నడుపుతున్నారు. దృష్టి పెట్టారా?

ఎస్సై : ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు 18 ఏళ్ల పూర్తయిన వారు నడపాలి. వారికి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి. తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇస్తే ఆర్టీవో చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. తల్లిదండ్రులు పిల్లలకు ఎలాంటి వాహనాలు ఇవ్వకపోవడం మంచిది.


ఆంధ్రజ్యోతి: మందమర్రిలోని జాతీయ రహదారిపై రాత్రి బైక్ రైడింగ్ జరుగుతుంది. మీ దృష్టికి వచ్చిందా.?

ఎస్సై : జాతీయ రహదారిపై ఇటీవల రాత్రి బైక్‌రైడింగ్ జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. పెట్రోలింగ్‌తో పాటు నిఘా కూడా పెట్టాం. రైడర్లు దొరికితే కఠిన శిక్షలు ఉంటాయి. రహదారి నిర్వాహకులకు విద్యుద్దీపాలు రెండు వైపులా అమర్చాలని కోరాం. దీంతో పాటు సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ప్రజల్లో ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు..?

ఎస్సై : సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అపరిచితుల ఫోన్‌కాల్‌పై అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నాం. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వివరిస్తున్నాం. అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టే ప్రక్రియను చేపడుతున్నాం.

-మందమర్రిటౌన్, ఆంధ్రజ్యోతి



కవిత్వమా.. వర్ధిల్లుమా..

● నేడు ప్రపంచ కవితా దినోత్సవం

నస్పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) ఆర్ధ్రత హృదయంతో స్పందించిన భావోద్వేగానికి అక్షరరూపమే కవిత్వం. కవులు, రచయితలు సమాజ సమస్యలను ఎత్తిచూపి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుతారు. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి. ఈ దిశలో 1999లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు.

ప్రపంచ వ్యాప్తంగా కవితా రచన, పఠన, ప్రచురణ, బోధనా వ్యాసంగంలో చైతన్యం, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ కవిత్వ ఉద్యమాల స్ఫూర్తిని పదిల పరచడమే కవితా దినోత్సవ లక్ష్యాలు. భాషా భిన్నత్వాల్ని కవితా ప్రచారంతో ఏకం చేసేందుకు ఈ దినోత్సవాన్ని ప్రతి యేటా నిర్వహిస్తుంటారు. అంతరించిపోతున్న భాషలను పునరుద్ధరించి భావితరాలకు అందించడం ఈ దినోత్సవ మరో ఉద్దేశ్యం. పూర్వం రాజాస్థానాల్లో కవిత్వానికి అక్షరలక్షలిచ్చినట్లుగా చదివాం.. విన్నాం. నేటి సమాజంలో కవిత్వం తాను రాసి సంతోషించి నలుగురికి చూపించి, వినిపించడం వరకు మాత్రమే జరుగుతుంది. కవిత్వలోతులు, అందాలు, పరమావధి తెలిసిన వారు ఇతరుల కవిత్వాన్ని ప్రోత్సహిస్తుంటారు. సాహిత్యంలో పట్టు లేని వారు సైతం కవితలను రాయొచ్చనే అంశాన్ని గుర్తులో ఉంచుకొని సమాజ సమస్యలు ఇతివృత్తంగా అద్భుత కవితలను అందరూ ఆవిష్కరించి ప్రతిఒక్క సృజనకారుడు స్పందించాల్సిన అవసరం ఉంది. ఇతరులను కవితా రచనా దారుల వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది. కాలానికి లేని విశిష్టశక్తి కలానికి ఉన్నదని నిరూపించే దిశగా కవులందరూ సమా లోచనలు చేయాల్సినవరం ఉంది. గేయ కవి త్వం, వచన కవిత్వం, భావ కవిత్వం, నానీలు రకరకాల రచనలు మనసులోని భావాలకు అక్షరరూపమే కవిత్వం.. సమా జాన్ని మేల్కొపుటలో సమాజంలోని రుగ్మత లను తొలగించు టలో ప్రజలను ఐక్యం చేయడంలో కవుల పాత్ర గణ నీయమైనది. శుక్రవారం కవిత్వ దినం సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం....

ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ఉండాలి



ప్రజలను నిరంతరం సమాజం పట్ల అప్రమత్తంగా ఉండేలా కవిత్వాన్ని రాస్తూ కవులు తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నారు. సమాజహితాన్ని కోరే సాహితీ వేత్తలు నిరంతరంగా ప్రజల పక్షాన నిలబడుతూ వారి హక్కులకు కాపలా కాసే విధంగా సాహిత్యాన్ని రాస్తున్నారు. సాహిత్యం వర్ధిల్లిన సమాజం ఖచ్చితం గా ప్రపంచానికి దిశా నిర్ధేశం చేసే విధంగా ఉంటుంది.

జి నర్సింహస్వామి , ప్రముఖ కవి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్-నస్పూర్

తెలంగాణ యాసలో మరిన్ని రచనలు రావాలి



తెలుగు భాషలో అందులో తెలంగాణ యాసలో మరిన్ని రచనలు రావాలి. సమాజ హితం కోరే రచనలు కవులు చేయాలి. చాలా మంది కవులు అరువు తె చ్చుకున్న అర్భాటాలతోనే కాలం వెళ్లబుచ్చు తున్నారు. చుట్టూ ఉండే పరిస్థితులను ఆకలింపు చేసుకుని తనకు తానుగా తీసుకునే నిర్ణయాలను సమాజం దృక్ప ధంతో ఏకీభవిస్తూ రచనలు చేస్తాడు. కవిత్వం సాధా రణంగా ఒక అంశాన్ని ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఆ కలింపు చేసుకుంటారు. కవి మాత్రం సమాజ కోణం నుంచి చూసి ఆ అంశాలను ఆవిష్కరింప చేస్తాడు.

- దరిపెల్లి స్వరూప, ప్రముఖ రచయిత్రి, మంచిర్యాల

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

బెల్లంపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వ హించే భూ సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్డీవో హరిక్రిష్ణ అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యల కోసం పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తున్నామన్నారు. గత రెండు వారాల్లో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 34 దరఖాస్తులు రాగా ఇందులో14 దరఖాస్తును పరిష్కరించామన్నారు. మండల స్థాయి నుంచి సబ్ డివిజన్ స్థాయి కమిటీకి నాలుగు దరఖాస్తులు వచ్చాయన్నారు. పెండింగ్ దరఖాస్తులను 21 రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఏసీపీ రవి కుమార్, సబ్ డివిజన్ లోని తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హరిక్రిష్ణ

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

దండేపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్ అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం, రాజీవ్ యువ వికాసం పథకంను శాసనసభలో తీర్మానం చేసి ఆమోదం తెలిపినందుకు, రైతులకు బోనస్ డబ్బులు ఇచ్చినందుకు గురువారం దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సంబరాలను ఘనంగా నిర్వహించారు. దండేపల్లి బస్టాండ్ గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మహార్యాలీ చేపట్టి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతతోపార్టీ నేతలు, కార్యకర్తలు .దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, మాజీ ఎం పీపీలు గడ్డం శ్రీనివాస్, కాంతరావు, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీని వాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్, సిరికొండ నవీన్, ముత్తె వెంకటేష్, దుర్గప్రసాద్, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పం చులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: ఎస్సీ వర్గీకరణ బిల్లు, రిజర్వేషన్ బిల్లు 42శాతం అసెంబ్లీలో ఆమోదం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీ రిజర్వేషన్ బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపచేసినందుకు టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కు మా ర్ గౌడ్ పిలుపు మేరకు క్షీరాభిషేకం చేశామన్నారు. సత్యనారాయణ, తిరుపతి, సంజీవ్, వసుంధర, భానేష్, సదానందం పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీలో బీసీలకు 42శాతం బడ్జెట్ కేటాయిస్తూ ఆమోదించడాన్ని హర్షిస్తూ పార్టీ శ్రేణులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం బట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మాజీ కౌన్సిలర్లు చెల్ల నాగభూషనం, వెంకటేష్, సురేష్ నాయక్, సువర్ణ, నాయకులు పాల్గొన్నారు.

భీమారం : అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీల రిజర్వేషన్‌ల బిల్లు, రాజీవ్‌యువ వికాసం పథకం ప్రవేశపెట్టినందుకు గురువారం జన్నారం మండల కేంద్రంలోని పద్మశాలి వార్డులో కాంగ్రెస్ నాయకులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు బాస్కర్, నరేష్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: ఎస్సీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఆమోదించడాన్ని హర్షిస్తూ గురువారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ రిజర్వేషన్లతో ఎస్సీలోని అన్ని కులాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ కుల సంఘాల నాయకులు చెన్నూరి సమ్మయ్య మాదిగ, జీడీ సారంగం, సమ్మయ్య, శంకర్, రాజనర్సు, ఆవునూరి పోచం, సంగి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.





దండేపల్లి బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు..సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పట్టణ అధ్యక్షుడు నరేశ్

సంక్షిప్త సమాచారం

భీమిని : గ్రామాల్లో నకిలీ వత్తనాలను అమ్మేవారి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని మల్లీడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో గతంలో నకిలీ విత్తనాలు విక్రయించే వారి ఇండ్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కూడలి వద్ద సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

కాసిపేట : ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా, మూఢనమ్మకాలను నమ్మవద్దని కాసిపేట పోలీసులు గురువారం సాయంత్రం పెద్దనపల్లి కొత్త కాలనలో కళాజాత ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. అనంతరం డయల్ 100, షీటీం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాపిక్ నిబంధనలపై ప్రజలకు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాల్లో ఉన్న పెర్టిలైజర్ దుకాణాలను గురువారం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సురేఖ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. యాజమానులకు సూచనలు చేశారు.

మందమర్రిరూరల్ : మండలంలోని పొన్నారం గ్రామంలో ఉపాధి హామీలో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో రాజేశ్వర్ గురువారం ప్రారంభించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య తదితరులు ఉన్నారు.

జన్నారం : 23న మంచిర్యాలో నిర్వహించే ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను గురువారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి విడుదల చేశారు.

లక్ష్యంతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు

టెన్త్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగి, పోటితత్వంతో చదువుకుంటునే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని, ఆదిశగా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే టెన్త్ పరీక్ష కేంద్రాన్ని ఆయన అక సిక్మంగా తనిఖీ చేసి పరీక్ష తీరు పరిశీలించారు. జిల్లాలోని ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలో అన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. దండేపల్లి కస్తూర్బీగాం ధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. మెను ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించడంతో పాటు వేసవి కాలంలో వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. దండేపల్లి ఎంపీడీవో కార్యలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సందర్శించారు. లే ఆవుట్‌భూముల క్రమబద్దీకరణలో బాగంగా ప్రభుత్వం చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ 2020 పథకంలో అందిన దరఖాస్తులలో అర్హులైన అభ్యర్థుల నుంచి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. బకాయి ఆస్తీ పన్నును 100శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. దండేపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్లు, వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు. పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి వార్డుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మాకు లపేట, నాగసముద్రంలో వ్యవసాయ క్షేత్రాలను కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులతో సందర్శించి రైతులతో మాట్లాడారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించిమళ్లీ రుణాలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం మండలంలో సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ వెంట ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, డిప్యూటి తహసిల్దార్ విజయ, వ్యవసాయశాఖ అధికారి గొర్ల అంజిత్‌కుమార్, ఆర్ఐ బొద్దుల భూమన్న, కస్తూర్బీ విద్యాలయ ఎస్‌వో మంజుల, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఆగని అక్రమ నిర్మాణాలు

(5వ పేజీ తరువాయి)

అధికారుల చర్యలు నిలిచి పోగా, కళ్లెదుటే కొత్త నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం నస్పూర్‌లోని తోళ్లవాగు ఒడ్డున వెలిసిన నిర్మాణాలను తొలగించిన అధికారులు...ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ కట్టడాలు ఊపందుకున్నా పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. దీంతో అధికారులే స్వయంగా టీఎస్ బీపాస్ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు మూటగట్టు కోవలసి వస్తోంది.

60 మందికిపైగా నోటీసులు జారీ..

మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 42లో ఆది నుంచి వివాదం నెలకొని ఉంది. అందులో మొత్తం 102 ఎకరాల స్థలం ఉంది. అందులో కొంత మొత్తాన్ని గతంలోనే కొన్ని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అసైన్ చేసింది. మిగతా భూమిలో 28 ఎకరాలను టీఎన్‌జీవో సభ్యులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించినట్లు చెబుతున్నారు. అదిపోను మిగతా స్థలం కాలక్రమేణ కబ్జాలకు గురవుతూనే ఉంది. కలెక్టరేట్‌ను ఆనుకొని ఉండటంతో ప్రస్తుతం ఆ భూముల ధర ఎకరాకు సుమారు రూ. 4 కోట్లు ఉంటుంది. దీంతో ఆ స్థలంలో అక్రమంగా బహుళ అంతస్థుల భవనాలు వెలిశాయి. దీంతో అక్రమ నిర్మాణాలు చేపట్టిన దాదాపు 60 మందికిపైగా రెండేళ్ల క్రితమే మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయిన కబ్జాల పర్వం ఆగకపోగా రోజు రోజుకూ విస్తరిస్తూనే ఉంది. గతంలో పలుమార్లు సర్వే సైతం నిర్వహిం చినా... అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉండేనా...?

నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లో అధికారులు నోటీసులు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా...? అన్న సందేహం ప్రస్తుతం ప్రజల్లో నెలకొంది. ఐదంతస్థుల భవనం ఓ బీఆర్ఎస్ నాయకునికి చెం దినది కావడంతో అధికారులు తక్షణమే స్పందించి కూల్చివేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనంతరం పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరిగినా స్పందనలేకపోవడమే దీనికి నిదర్శనం. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలన్నింటి పైనా తక్షణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. తమ, పర బేధం లేకుండా అక్రమార్కులందరిపైనా ఒకే రకమైన చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

దండేపల్లి, మార్చి20(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడికి గురికాకుండా ఆత్మస్థైర్యంతోనే పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని దండేపల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఆర్య వైశ్య యువజన సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు మాదంశెట్టి మల్లిఖర్జున్ అన్నారు. దండేపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మామిడిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్‌లను ఆయన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాద్యాయుడు నగునూరి రవీందర్, ఉపాద్యాయులు పడిగెల కృష్ణరావు, రమేష్, జీవి స్వప్న, నాగరాణి, సీహెచ్ సరిత. జవేరియా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు

కాసిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు ప్రతి రోజు ఈ నిబంధనలు పాటిస్తే పరీక్షలను అద్భుతంగా రాస్తారని కౌన్సిలింగ్ సైకాలజిస్టు అండ్ మోటివేషనల్ స్పీకర్ బానావత్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థులు ఉదయాన్నే లేచి గోరు వెచ్చని నీటితో స్నానం చేసి త్వరగా సిద్ధం కావాలన్నారు. పరీక్షకు కావాల్సినవి (హాల్‌టికెట్, పెన్ను, పెన్సిల్, ఇతర సామగ్రి)ని సర్దుకోవాలన్నారు.. తేలి కపాటి అల్పాహారం తిని శరీరానికి సరిపడ నీరు తాగాలని తెలిపారు. పరీక్ష కేంద్రానికి 40 నిమిషాల ముందే చేరుకోవాలన్నారు. పరీక్ష సమయాన్ని దృష్టిలో ఉంచుకుని జవాబులు రాయాలి. పరీక్ష గది నుంచి బయటకు వచ్చాక పరీక్ష గురించి చర్చించవద్దు. ఈ నియమాలను పాటిస్తే పరీక్షలు బాగా రాయవచ్చని తెలిపారు.

లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు గురువారం మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 36 పార్టీల నుంచి 32 రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చాయన్నారు. తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రబుత్వానికి పంపినా బీసీ బిల్లు పెట్టకపోవడం బీసీలను రాజకీయంగా వివక్షకు గురి చేయడమేనన్నారు. నాయకులు శ్రీనివాస్, రఘునందన్, బీమ్‌సేన్, రమేష్, రాములు, సతీష్, రాజేశం పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో..
ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చెన్నూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నుల వసూలు పేరుతో ఇంటి యాజమానులను ఇబ్బందులకు గురి చేయవద్దని జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ మూల రాజిరెడ్డి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను కోరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌తో మాట్లాడారు. వారం రోజుల నుంచి ఇంటి పన్నుల వసూలు పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం వసూలు చేయాలి కానీ ఇంటి యాజమానుల వద్దకు రాత్రివేళల్లో వెళ్లి పన్ను కట్టాలని, లేకపోతే ఇండ్లకు తాళం వేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంటి పన్నుల విషయంలో గడువు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తుపై విచారణ

తాండూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలానికి చెందిన బర్ల సుగుణ ఇటీవల ప్రజావాణిలో కొడుకులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని గంపలపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 18లో 8 ఎకరాల 19 గుంటల భూమిపై సుగుణ ఇద్దరు కొడుకుల మధ్య వివాదం నడుస్తుంది. ఇందులో సగం వాటా చిన్న కుమారుడి పేరు మీద పట్టా జరగగా మిగితా భూమి తల్లి సుగుణ పేరుమీద పట్టా ఉంది. ఈ విషయంలో ఇద్దరు కుమారులు గొడవ పడి తల్లిని పట్టించుకోకపోవడంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీంతో అధికారులు విచారణ చేపట్టి సుగుణకు అన్యాయం జరుగుతుందని సీనియర్ సిటిజెన్ యాక్ట్ అమలు చేయడానికి బెల్లంపల్లి ఆర్డీవోకు నివేదిక సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

మందమర్రిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన బహుజన ముక్తి పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మొయ్య వేణు గోపాల్‌పై దాడి చేసిన వారిపై హత్యయత్నం కేసు నమోదు చేయాల ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు దాస్‌రామ్‌నాయక్, ఫయాజుద్దీన్‌లు కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంటనే దాడి చేసిన శిక్షించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు శంకర్, ధర్మయ్య పాల్గొన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:23 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 5:03 (శనివారం ఉదయం)

ఆగని అక్రమ నిర్మాణాలు



సర్వే నంబర్ 42లో నిర్మాణంలో ఉన్న భవనం

- మూన్నాళ్ల ముచ్చటగా మారిన కూల్చివేతలు
- అధికారుల తీరుపై ప్రజల విస్మయం
- కూల్చిన చోట మళ్లీ నిర్మిస్తున్న భవనాలు

మంచిర్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుం డా పోతోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమం గా వెలిసిన వెంచర్లలోని ప్లాట్లను అక్రమ పద్ధతుల్లో చేజిక్కించుకుంటూ వాటిలో పక్కా భవనాలు నిర్మి స్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. కలెక్టర్ కార్యా లయానికి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణా లు కొద్ది రోజులుగా ఊపందుకోవడం గమనార్హం. అవే స్థలాల్లో గతంలో నిర్మించిన ఇళ్లను సమూలంగా కూల్చివేసిన మున్సిపల్ అధికారులు ఆరంభ శూ రత్వం ప్రదర్శించారనే అభిప్రాయాలు ఉన్నాయి. గతంలో కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు జరుగుతు న్నా తమకేమీ సంబంధం లేన్నట్టు చేతులు ముడు చుకొని కూర్చుండటమే దీనికి నిదర్శనం.

చతికిలబడ్డ చట్టం....

మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభు త్వం మున్సిపల్ చట్టం 2019లోని టీఎస్-బీ పాస్‌కు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా లేఅవుట్ పర్మిషన్, భవన నిర్మాణాలకు అనుమతు లు, తదితర ప్రక్రియను పటిష్టం చేసేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలను సైతం నియమించింది. నిబంధనలను అతిక్రమించే వారిప ట్ల కఠినంగా వ్యవహరించేలా టాస్క్‌ఫోర్స్ బృందాల కు విస్తృత అధికారాలను ప్రభుత్వం కట్టబెట్టింది. అందులో భాగంగా అనుమతులు లేని నివాస గృ హాలు, కమర్షియల్ భవనాలతోపాటు లేఅవుట్ లేని వెంచర్లలోని నిర్మాణాలను ఎలాంటి ముందస్తు నోటీ సులు జారీ చేయకుండానే నేరుగా కూల్చే అధికారం టాస్క్‌ఫోర్స్ బృందాలకు ఉంది. ఆ చట్టం ప్రకారం 2021 సెప్టెంబరులో జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల బైపాస్ రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న రెండు భవ నాలను టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది. అయితే గతకొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాలు జరుగుతు న్నా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టించుకోక పో వడంతో చట్టం చతికిలబడ్డట్లు కనిపిస్తోంది.

ఇవీ నిబంధనలు....

భవన నిర్మాణాలు చేపట్టే ప్రజలు అనుమతుల కోసం దరఖాస్తు చేసే సమయంలో సమర్పించిన ప్లాన్‌ను విధిగా అమలు పర్చాలి. అనుమతి కాపీలో పేర్కొన్న విధంగా నిర్మాణం చేపట్టాలి. సెట్ బ్యాక్, రోడ్డు నిబంధనలు పాటించడంతోపాటు అనుమతు లు ఉన్న మేరకు పై అంతస్తుల నిర్మాణం చేపట్టాలి. గృహావసరాల కోసం అనుమతులు పొంది, కమర్షి యల్‌గా ఉపయోగించే వారిని సైతం నిబంధనల ఉల్లంఘన జాబితాలో చేర్చుతారు. గృహ, కమర్షియ ల్ భవన నిర్మాణాలతోపాటు లే అవుట్ అనుమతు లు లేకుండా ఏర్పాటు చేసే ప్లాట్లు చట్ట విరుద్ధం కా గా, అలాంటి వాటిపై టాస్క్‌ఫోర్స్ బృందాలకు చర్య లు తీసుకొనే అధికారం ఉంది.

ఆనాటి చర్యలేవి...?

జిల్లా కేంద్రంలోని హమాలివాడలో 2021 జూలై లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తుల భవనం స్లాబును టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు కూల్చేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. అదే సంవత్సరం ఆగస్టు లో నస్పూర్‌లోని రెడ్డి కాలనీలో ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల గోడలతో పాటు షెడ్లను సైతం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు. అప్పుడు కూ డా పెద్ద రాద్ధాంతమే జరిగింది. అదే సమయంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోనూ నిబంధనలకు విరుద్ధంగా వెలసిన కట్టడాలను టాస్క్‌ఫోర్స్ బృందాలు కూల్చివేస్తుండగా మెజార్టీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీలేక టాస్క్‌ఫోర్స్ బృందం వె నుదిరగాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా నస్పూర్ శివారు సర్వే నంబర్ 11,64,42లలోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన నివాస గృహాలు, ఇతర కట్టడాలను రెండేళ్ల కిందట అధికారులు తొలగించారు. గత సంవత్సరం సెప్టెంబరు 19న నస్పూర్‌లో అసైన్డ్ భూమిలో నిర్మించిన బీఆర్‌ఎస్ నేత ఢీకొండ అన్నయ్యకు చెందిన ఐదంతస్తుల భవనాన్ని అధికారులు నేలమ ట్టం చేశారు. దీంతో అప్పట్లో అధికారుల చర్యలపట్ల ప్రశంసల జల్లులు కురిశాయి. అయితే అనతికాలం లోనే అక్రమ కట్టడాలపై..

(తరువాయి 7లో)

కేసీ వేణుగోపాల్‌ను కలిసిన పెద్దపల్లి ఎంపీ

పలు అంశాలపై చర్చ



వేణుగో పాల్‌తో గడ్డం వంశీకృష్ణ

మందమర్రిటౌన్, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను గురువా రం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలి శారు. ఆయనతో పాటు మిగతా పార్ల మెంట్ సభ్యులు కూడా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అను స రిస్తున్న పలు ప్రజా వ్యతిరేక విధానా ల గురించి చర్చించారు. ఎల్‌ఐసీ ఏ జెంట్లకు సంబంధించిన సమస్యలను కూడా కేసీ వేణుగోపాల్ దృష్టికి తీసుకె ళ్లారు. తప్పకుండా పార్లమెంట్‌లో దొరి కిన సమయంలో కేంద్ర ప్రభుత్వ విధా నాలను ఎండగట్టాలని తెలిపారు.

షీటీంపై అవగాహన

మంచిర్యాలక్రైం, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): మంచిర్యాల పట్టణం విశ్వనా థ ఆలయ కాలక్షేప మండపంలో మమ త మహిళ తరంగిణి తరుపున మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా షీటీంపై అవగాహన సదస్సును కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హైమా మాట్లాడు తూ పిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గు రించి మహిళలు వారి పిల్లలకు నేర్పిం చాలన్నారు. ఏదైన సమస్య వచ్చినప్పు డు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలకు షీటీం తక్షణమే సాయం చేస్తుందన్నారు. ఎవరైన ఆకతాయిలు వేధింపులకు గురి చేసిన 100కు గాని 6303923700 నంబరుకు ఫిర్యాదు చే యాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పే ర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అర్పితారెడ్డి, షీటీం సభ్యులు శ్రా వణ్‌కుమార్, మహిళా కానిస్టేబుల్ జ్యో తి, శ్రీలత, మమత పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



మందమర్రిలో రాష్ట్రీయ రహదారిని పరిశీలిస్తున్న ఏసీపీ

మందమర్రి టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాష్ట్రీ య రహదారిపై వాహన ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. స్థానిక జా తీయ రహదారిలో ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగవని, ఈ మధ్య కాలంలో అతి వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల భారీన పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, రామగుండం సీపీతో పాటు బెల్లంపల్లి ఏసీపీ ఆదేశాల మేరకు రహదారి నిర్వాహకులు సీసీ కెమెరాలను అమ ర్చాలని కోరుతున్నామన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ నివా రణకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, లైటింగ్ వ్య వస్థ అస్తవ్యస్తంగా ఉందని, విద్యుత్ దీపాలు అమర్చాలని కోరు తు న్నామన్నారు. రహదారిపై రాత్రివేళలో పశువులు ఉండకుండా చర్యలు చేపట్ట నున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా రైతులు అర్ధరాత్రి రోడ్లపై పశువులను వదిలితే వారిపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశే ఖర్, రామకృష్ణాపూర్ ఎస్సై పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ కోటేశ్వర్

బెల్లంపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని రోగులు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్ కోటేశ్వర్ అన్నారు. గురువారం వందపడకల ఏరియా ఆసుపత్రిని సందర్శించి మాట్లాడా రు. ఈ సందర్భంగా వార్డుల్లోని రోగులతో వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులతో పాటు సౌకర్యాలు ఉన్నాయని మెరుగైన వైద్యం అందిస్తున్నా మని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమారి, వైద్యులు మూర్తి, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వె డ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం జన్నారం మండలంలోని కొత్త పేట గ్రామంలో 126 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూ జ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి పేదల కళ్లల్లో ఆనందాన్ని నిం పేందు కు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చిన బడ్జెట్‌లో పేదలకు న్యాయం జరగనుందని స్పష్టం చేశారు.

మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన దుర్గం మధు మితకు రూ. 4 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ (ఎల్‌వోసీ) చెక్కును గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ము జాఫర్ అలీఖాన్, పసివుల్లా, మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ముత్యం సతీష్ పాల్గొన్నారు.

హమ్మయ్య..పరీక్షలు అయిపోయాయ్

- ముగిసిన ఇంటర్‌మీడియట్ పరీక్షలు



దండేపల్లి పరీక్ష కేంద్రం వద్ద ముచ్చటిస్తున్న విద్యార్థులు

దండేపల్లి, మార్చి, 20 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5నుంచి జరుగుతున్న ఇంటర్ వార్షిక పరీక్ష గురువారంతో ప్రశాంతంగా ముగి సాయి. పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ సెకండియర్ పరీక్షరాసిన విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. చివరి పరీక్ష ముగియగానే ఆత్మీయతంగా ఒక్కరినొకరు విద్యార్థులు పలకరించుకున్నారు. పరీక్ష ఎలారాశావు ఎన్నిమార్కులు వస్తాయని అంటూ వారు చర్చించుకున్నారు. అరగంట పాటు ఆనందోత్సాహంతో వీడ్కోలు చెప్పుకున్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ కుమార్ దీపక్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

లక్షెట్టిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగు తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అకస్మి కంగా పరిశీలించారు. పాఠశాల తరగతి గదులతో పాటు వంటశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సదు పాయాలు కల్పిస్తుందన్నారు. ఇటీవల విద్యా ర్థులకు మెస్‌చార్జీలను కూడా పెంచింద న్నారు. మధ్యాహ్న భోజనం నూతన మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించాలని వంట శాల, కూరగాయలు, మంచి నాణ్యమైన సరుకులు ఉపయోగించాలని సూచించారు. 10వతరగతి విద్యా ర్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుద లతో పరీక్షలు రాసి మంచి మార్కు లు సాధించాలని మంచిర్యాల జిల్లా ఈఏడాది 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితా లతో ప్రథమస్థానంలో ఉండాలన్నారు. అదే విధంగా పట్టణంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న 30పడకల ఆసు పత్రి భవన నిర్మాణం పనులను పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయలని ఆదేశించారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి నిర్వహకులకు పలు సలహాలు సూచనలు అందజేసారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట అధికా రులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

- అదనపు కలెక్టర్ మోతిలాల్

కాసిపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని తీర్చిదిద్దడంతో పాటు దేశాభి వృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నా రు. గురువారం కాసిపేట మండల కేంద్రం లోని రైతు వేదికలో జిల్లా వయోజన విద్యా సఖి లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ వారోత్స వాల ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా తోడ్పాటునందిస్తున్నారన్నారు. దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదిముర్ముతో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, నేవి, ఎయిర్‌ఫోర్స్, శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారన్నారు. ప్రతి రంగంలో మహిళల పాత్ర కీలకమైనదని తెలిపారు. మహిళలు సాధిస్తున్న విజయాలకు గుర్తింపునిచ్చి మరింత ప్రోత్సహించాలన్నారు. మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. సావిత్రిబాయిపూలే మహిళల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. కాసిపేట మండ లాన్ని వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దే కార్యక్రమం జరుగుతుం దన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయడం జరుగు తుందన్నారు. మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా అల్పాసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి రాజేశ్వరి, లయన్స్‌క్లబ్ సఖి ప్రెసిడెంట్ బండ శాంకరి, ఏఈవో రమ్య, పంచాయతీ కార్యదర్శి మేఘన, మోటివేషన్ స్పీకర్ చైతన్య, డీఆర్‌పీలు సుమన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఐదు నిమిషాల నిబంధన వర్తిస్తుంది

మంచిర్యాలక్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభ మవుతున్నాయి. ఉదయం 9.30 గంటల నుం చి మధ్యాహ్నం 12.30గంటలకు పరీక్షలు జరు గుతాయి. పరీక్షా సమయానికి గంట ముందు గానే సెంటర్‌కు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో హా ల్‌టిక్కెట్ నెంబర్లు వేసి పరీక్షకు సన్నద్ధమ య్యారు. జిల్లాలో 370 పాఠశాలలు ఉండగా 9,410 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారు. 49 మంది సూపరింటెండెంట్లు, 49 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సెంటర్ కస్టో డియన్ నలుగురు, 461 మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు, 49 సి ట్టిం గ్ స్క్వాడ్‌లు నియమించామని డీఈవో యా దయ్య తెలిపారు. పరీక్ష సమయంలో ప్రశాం తంగా చదివి ఒత్తిడికి గురికాకుండ తల్లి దం డ్రులు జాగ్రత్తగా పిల్లలను సెంటర్ వద్దకు సమయానికి ముందే తీసుకరావాలని సూ చించారు. సెంటర్ల వద్ద 163 నిబంధన అ మలులో ఉంటుందన్నారు. అయిదు నిమిషా ల నిబంధన ఉంది కాబట్టి విద్యార్థులు దీనిని దృష్టిలో పెట్టుకుని ముందుగానే సెంటర్‌కు చే రుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

లక్షెట్టిపేట: 10వ తరగతి పరీక్షలకు అధి కారులు ఏర్పాట్లను సిద్ధం చేసారు. ఎంఈవో హెలన్‌డార్థి ఇన్విజిలేటర్లతో సమావేశం ఏర్పా టు చేసి పలు సలహాలు సూచనలు అందజే శారు. మూడు సెంటర్లలో కలిపి 616మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఏంఈవో పేర్కొన్నారు.

భీమిని : నేటి నుంచి జరుగనున్న పదవ త రగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎం ఈవో కృష్ణమూర్తి తెలిపారు. గురువారం మం డల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిం చే పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆయన ప రిశీలించి ఏర్పాట్లను పరిశీలించారు. 95 మంది విద్యా ర్థులు పరీక్షలు పరీక్షలు రాయనున్నారు.

తాండూర్: నేటి నుంచి మండలంలో జరిగే పదవ తరగతి పరీక్ష కేం ద్రాలను గురువారం ఎంఈవో మల్లేశం పరిశీలించారు. రెండు పరీక్ష కేం ద్రాల్లో మొత్తం 394 మంది పరీక్షలు రాయ నున్నట్లు తెలిపారు.

కాసిపేట : నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు మండలంలో 457 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. కాసి పేట తెలంగాణ మోడల్ పరీక్ష కేంద్రంలో 169 మంది, మల్కేపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 85 మంది, దేవాపూర్‌లోని డీఏవీ ఓరియంట్ జ్ఞానమందిర్‌లో 127 మంది హాజ రు కానున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎం ఈవో వెంకటేశ్వర స్వామి తెలిపారు.



తాండూర్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశం

కోటపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, పారుపెల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు ఏర్పాట్లు పూ ర్తి చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్ తెలిపారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 192 మంది విద్యార్థులు, పారుపెల్లి పరీక్ష కేంద్రంలో 94 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. చీ ఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికా రులతో పాటు ఇన్విజిలేటర్లు, సిట్టింగ్‌స్క్వాడ్ విధులు నిర్వర్తిస్తారన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 913 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్న ట్లు, 45 మంది ఇన్విజిలేటర్లను నియమించి నట్లు ఎంఈవో దత్తుమూర్తి తెలిపారు.

చెన్నూరు : పదవ తరగతి పరీక్షకేంద్రాల ను గురువారం సీఐ దేవేందర్‌రావు పరిశీలిం చారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా బందోబ స్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నెన్నెల : పదో తరగతి పరీక్షల కోసం పక డ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో చంద్ర శేఖర్ తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశా లలో పరీక్ష కేంద్రాన్ని పరిశీ లించారు.

మండలంలో 190 మంది విద్యార్థులు పరీక్ష లు రాయనున్నట్లు చెప్పారు. ఒక చీఫ్ సుప రిండెంటు, ఇద్దరు డిపార్ట్‌మెంటల్ అధికారు లు, 18 మంది ఇన్విజిలెటర్లను నియమించి నట్లు తెలిపారు.

దండేపల్లి : పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈవో చిన్నయ్య తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలకు పరీక్ష చీ ఫ్ సూపరిండెంట్‌లు రాజన్న, అజయ్‌కు మా ర్ డిపార్టుమెంటల్ అధికారులు శ్రీనివాస్. ర మేష్ విధులు నిర్వహించనున్నారు.